క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.8.62 లక్షలు

పత్తికొండ రూరల్ : మండలంలోని పులికొండ రంగనాథ స్వామి ఆలయంలోని హుండీ సొమ్మును ఆలయ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో సోమవారం లెక్కించారు. లెక్కింపులో మొత్తం రూ.8,62,679 ఆదాయం వచ్చినట్లు ఈఓ వీరయ్య తెలిపారు.

సారా తయారుచేస్తే కేసులు

తుగ్గలి : నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా కేసులు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిప్రవీణ్ హెచ్చరించారు. సోమవారం లక్ష్మితండాలో సారా నియంత్రణపై గ్రామసభ నిర్వహించారు. సారాతో కలిగే అనర్థాలు, కేసులు, ఆర్థిక ఇబ్బందులపై తండావాసులకు అవగాహన కల్పించారు. సారా తయారీ, అమ్మకాలు మానుకొని ఇతర పనులు చేసుకోవాలని సూచించారు. సారా తయారు, అమ్మకాలు నేరమని ఇకపై బాధ్యులపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


పింజరి శేఖన్న (ఫైల్)

హొళగుంద: కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బళ్లారి పెద్దాసుపత్రి లో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన పింజరి శేఖన్న(58) ఆదివారం రాత్రి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తుండేవాడు. మూడు రోజుల క్రితం ఆరోగ్యం విషయంపై కర్ణాటకలోని కారువార్ సమీపంలోని అలగకు కారులో బయలుదేరారు. తుముకూరు – బెంగళూరు హైవేపై వెళ్తుండగా కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురితో పాటు శేఖన్న తీవ్రంగా గాయపడటంతో బళ్లారికి తరలించారు.కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాముల దగ్ధం


కాలిబూడిదైన గడ్డివాములు

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో రెండు గడ్డివాములు సోమవారం సాయంత్రం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రైతు బోయ దేవరాజుకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ.80 వేల దాకా ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాదం ఎలా జరిగిందో తెలిదయని వాపోయాడు.

రైతులను ఆదుకోవాలి

హొళగుంద: వ్యవసాయం గిట్టుబాటు కాక తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవడానికి 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప డిమాండ్ చేశారు. సోమవారం వారు మండల కేంద్రంతో పాటు చిన్నహ్యాట గ్రామంలో రైతు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ నెల 15న కర్నూలులో రైతు సదస్సు జరుగుతుందని అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణయ్య, ఇబ్రహీం, కురువ గాదిలింగప్ప, శివమ్మ, సిద్దయ్య పాల్గొన్నారు.

కోతుల బెడద

మద్దికెర : మండల కేంద్రంలో కోతుల బెడదతో జనాలు బెంబేలెత్తుతున్నారు. పలు కాలనీల్లో బయటికి రావడానికి జనం జంకుతున్నారు. సోమవారం స్థానిక సాయినగర్‌లో మహిళలపై కోతులు దాడులు చేసి కురువ లక్ష్మీదేవిని గాయపరిచాయి. దీంతో మిగిలిన మహిళలు పరుగులు పెట్టారు. మార్కెట్‌కెళ్లి సరుకులు తెచ్చుకుందామంటే కోతులు దాడులు చేస్తాయోమోనని భయభ్రాంతులకు గురువుతున్నారు.

అధికారుల తీరుపై నిరసన

దేవనకొండ: మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యధోరణికి నిరసనగా సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, మహబూబ్‌బాషా తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బైఠాయించారు. వారు మాట్లాడుతూ తెర్నెకల్ గ్రామానికి చెందిన మాబాషా అనే రైతుకు సర్వేనంబర్ 381/1లో ఏడు ఎకరాల వ్యవసాయ పొలంలో 27 సెంట్లు హంద్రీనీవా కాలువ కింద పోయిందని, అయితే మిగిలిన 6.63 ఎకరాలు పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాల్సి ఉండగా, రీ సర్వే పేరుతో 6.30 ఎకరాలను మాత్రమే రెవెన్యూ రికార్డులో నమోదు చేసి మిగిలిన 33 సెంట్లు మరో రైతు ఖాతాలో ఎక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సర్వేనంబర్ 382-ఏలో 1.50 ఎకరాలకు గానూ 50 సెంట్లు హంద్రీనీవా కాలువలోకి వెళ్లిందని, 50 సెంట్లు పరిహారం ఇవ్వకుండానే ఆన్‌లైన్‌లో తొలగించారని వాపోయారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున వారికి సర్ది చెప్పి మంగళవారంలోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసనను విరమించారు.

పన్ను కట్టరేమి సారూ!

- ప్రాపర్టీ పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- మండలంలో బకాయిల విలువ రూ.40లక్షలకు పైమాటే
- దశాబ్దాలుగా పట్టించుకోని ఆయా శాఖల ఉన్నతాధికారులు
- ఆదాయాన్ని కోల్పోతున్న పంచాయతీలు



ప్రాపర్టీ పన్ను చెల్లించని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఆలూరు: ప్రభుత్వంలోని వివిధ శాకలకు చెందిన చర,స్థిరాస్తులకు సంబంధించి రెవెన్యూ, గ్రామ పంచాయతీలకు ఆస్తి విలువను బట్టి పన్ను చెల్లించాలని ప్రభుత్వ నిబంధనలు పేర్కొంటున్నాయి. ఇందులో భాగంగానే మేజర్, మైనర్ గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్, సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, విద్యుత్, విద్యశాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆర్‌అడబ్ల్యూఎస్, పీఆర్, ఏఎస్‌డబ్ల్యూఓ, పశువైద్యశాలలు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అగ్నిమాపక తదితర ప్రభుత్వ భవనాలకు ప్రాపర్టీ పన్నును సంబంధిత అధికారులు చెల్లించాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి,హొళగుంద, దేవనకొండ, మండల కేంద్రాల్లో దాదాపు 28 ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌బ్ల్యూఎస్ డీఈ, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తదితర శాఖలకు చెందిన అధికారులకు గ్రామ పంచాయతీలు పలుమార్లు నోటీసులు జారీ చేసినా కొన్నేళ్లుగా బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. బిల్లుల వసూళ్లలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం, ఆయా శాఖల ఉన్నతాధికారులను గట్టిగా అడగకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి నిలిచిపోతోంది. అయినా ఆయా శాఖల అధికారులు బిల్లుల చెల్లింపునకు ముందుకు రాకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఆలూరులో మొత్తం వివిధ శాఖల కార్యాలయాల నుంచి రూ.40 లక్షలు వరకు బకాయిలు ఉన్నాయి. ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ ఖాజానకు ప్రాపర్టీస్ పన్నును చెల్లించాల్సి ఉంది. నియోజకవర్గంలో ఆస్పరి,చిప్పగిరి,దేవనకొండ, హాలహర్వి హొళగుందలో కూడా వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి కూడ ప్రాపర్టీ పన్నులు చెల్లించకపోవడంతో లక్షలాది రూపాయి బకాయిలు పేరుకుపోయాయి.

ఆలూరులో 2023 వరకు బకాయి పడిన పలు ప్రభుత్వ కార్యాలయాల వివరాలు..

- బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం 2014 నుంచి 2023 వరకు రూ.70,697
- పోలీసు సర్కిల్ కార్యాలయం 2012 నుంచి రూ.65,338
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1999 నుంచి రూ.26,700
- పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలు 1999 నుంచి రూ.80,557
- సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం 2014 నుంచి రూ.50,358
- ఎంపీడీఓ కార్యాలయం 2018 నుంచి రూ.22,810

బిల్ కలెక్టర్ల కొరత

పత్తికొండ డివిజన్ పరిదిలో 9 మేజర్ గ్రామపంచాయతీలు ఉన్నా యి. ప్రస్తుతం పత్తికొండ, మద్దికెర, కృష్ణగిరి, తుగ్గలి ,దేవనకొండ,హొళగుంద, ఆస్పరి మండల కేంద్రాల్లోని మేజర్ గ్రామపంచాయతీలకు రెగ్యులర్ బిల్ కలెక్టర్లు పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. అయితే మార్చి నెలాఖరు వరకు ఇంటింటికీ తిరిగి కాంట్రాక్టు కార్మికులతో ఈఓలు ప్రాపర్టీ పన్నులను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. పంచాయతీల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ప్రాపర్టీ పన్నును కొన్నేళ్ల నుంచి ఆయా శాఖలకు చెందిన అధికారులు చెల్లించలేదు. – వీరభద్రప్ప, పత్తికొండ డివిజన్ పంచాయతీ అధికారి

నేటి నుంచి దేవర

కృష్ణగిరి: మండలంలోని ఆగవేళి గ్రామంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు గ్రామ దేవతల దేవర ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం పెద్దమ్మ, సుంకులమ్మ, రాములమ్మ, మారెమ్మ, కర్రెమ్మ అమ్మవార్లను ప్రత్యేక ఆలంకరించి ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. గ్రామం బంధుమిత్రులతో కళకళలాడుతోంది.

ఏపీజీబీ హెడ్ ఆఫీస్‌ను కడపలోనే ఉంచాలి

కృష్ణగిరి: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ హెడ్ ఆఫీస్‌ను కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం సభ్యులతో కలిసి కృష్ణగిరిలోని ఏపీజీబీ బ్రాంచ్ ముందు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్కువ కాలంలోనే అనేక గ్రామాలకు ఏపీజీబీ కింద సేవలు అందుతున్నాయని, కడప నుంచి అమరావతికి మార్చడంతో ఇక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ప్రసాద్, వెంకటేష్, మౌలాలి, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు రమణయ్య, సయ్యద్, ఎల్లప్ప, హమాలీ యూనియన్ నాయకులు రాజు, గోపాల్, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం సభ్యులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సోలార్ కంపెనీలకు భూములిచ్చి మోసపోకండి



కురుకుంద గ్రామ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆలూరు రూరల్: రైతుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని తక్కువ ధరకే భూములు కొనుగోలు చేస్తున్న సోలార్ కంపెనీల మాయలో పడి మోసపోవద్దని ఏపీ రైతు సంఘం నాయకులు రైతులకు సూచించారు. మండలంలోని కురుకుంద,కరిడిగుడ్డం, మొలగవల్లి,హత్తిబెళగల్ తదితర గ్రామాల్లో సోమవారం జీపు జాత కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడారు. నిత్యం కరువుతో రైతులు పంటలు సాగు చేయలేక వలసలు వెళ్తారని, తక్కువ ధరకే భూములు లభిస్తాయని ప్రభుత్వం ఈ ప్రాంతంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఈ నెల 6వ తేదీన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నారాయణ స్వామి, కృష్ణ,ధనుంజయ,మైన పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్ను వసూళ్లు పూర్తి చేయాలి


గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

ఆలూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఈఓపీఆర్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటి, కుళాయి పన్నులు వంద శాతం వసూళ్లు చేయాలని చెప్పారు. అలాగే ఎన్నో ఏళ్లుగా పన్ను బకాయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు అందించాలని ఆదేశించారు. వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులు శుభ్రం చేసి,పైపుల మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. చెత్త సంపద కేంద్రాలను పూర్తిగా అందుబాటులో తీసుకురావాలని, వర్మీ కంపోస్టు తయారీ వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు విజయ్,ఉరుకుందప్ప,వెంకట్ నాయుడు, జిలాన్, రమేష్ ఉన్నారు.

బస్టాండులో వసతులు కల్పించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

దేవనకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రవికుమార్, ఎం.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్ నాయక్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బస్టాండులో వసతులు లేక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చివరకు మల,మూత్ర విసర్జనకు కూడా సదుపాయాలు లేవన్నారు. 44 గ్రామాలకు కేంద్ర బిందువైన బస్టాండులో వసతులు కల్పించకపోవడమేంటని ప్రశ్నించారు. మహబూబ్‌బాషా, నరేష్, భాస్కర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో సోమవారం ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ దేవతలు, స్వామి వారికి అభిషేకం, కలశ పూజ, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

10న వెంగళాయిదొడ్డిలో దేవర

ఆస్పరి: మండలంలోని కారుమంచి మజరా గ్రామమైన వెంగళాయిదొడ్డి గ్రామంలో ఈనెల 10వ తేదీన సుంకులమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు సర్పంచ్ లక్ష్మి సోమవారం తెలిపారు. 10న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, 11న గంగ, ఆకు పూజ, కుంకుమార్చన, పట్టు వస్త్రాల సమర్పణ, కుంభాలతో నైవేద్యం సమర్పిస్తారని వివరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

దేవనకొండ: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 8 వారాల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, మండల కార్యదర్శి మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా రెండు నెలలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు యూసుఫ్ బాషా, బజారి, గాజుల శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

11నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ వీరయ్య తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, ఆలయ మాజీ చైర్మన్ అంజనయ్య, గ్రామస్తులు నరసింహులు, రామాంజులు, రాము పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

ఆలూరు: మండలంలోని మరకట్టు గ్రామంలో గ్రామ కంఠం స్థలంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ సంఘం అధ్యక్షుడు జైభీమ్ సాయిరాం కోరారు. సోమవారం వివిధ గ్రామాల మాల మహానాడు కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదోని మండల అధ్యక్షుడు నరేష్‌కుమార్, కృష్ణ,ఎల్లప్ప, గోపాల్, ప్రభాకర్,రఘునాథ్ ఉచ్చీరమ్మ పాల్గొన్నారు.

మద్దికెర ఆర్‌ఐగా రామదాసు

మద్దికెర : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రామదాసు సోమవారం బాధ్యతలు స్వీకరించారని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. ఇదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామదాసుకు ఆర్‌ఐగా పదోన్నతి లభించిందన్నారు. గతంలో ఆర్‌ఐగా పనిచేసిన రవికుమార్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించిందని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

కృష్ణగిరి: స్థానిక మోడల్‌స్కూల్‌లో సోమవారం జరిగిన ఇంటర్ సెకండియర్ పబ్లిక్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ షేక్ షంషున్నిసా, డిపార్ట్‌మెంటల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. పరీక్షలకు 185 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 183 మంది హాజరైనట్లు తెలిపారు.

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సవిత, డిపార్ట్‌మెంటల్ అధికారి కిరణ్మయి సోమవారం తెలిపారు. 138కి 131 మంది హాజరయ్యారన్నారు.

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ సెకండియర్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. 169 మందికి గాను 166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు, కన్నడ, హిందీ పరీక్షలు జరిగాయని పరీక్షా కేంద్రం చీఫ్, ప్రిన్సిపాల్ ప్రవీణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ బాబు తెలిపారు.

కట్టు తప్పితే.. కట్టాల్సిందే!

- పటిష్టంగా మోటార్ వాహన చట్టం
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, లైసెన్స్‌లు రద్దు
- హైకోర్టు ఆదేశాలతో ప్రత్యేక నిబంధనలు
- వాహనాదారులు సహకరించాలంటున్న పోలీసులు


పత్తికొండ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

తుగ్గలి : రహదారి ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ చట్టాన్ని ఈనెల 1వ తేదీ నుంచి పటిష్టంగా అమలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సవరించిన జరిమానాలు విధించడంతో పాటు పదే పదే ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను సైతం రద్దు చేయనున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసులకు వాహనదారులు సహకరించాలని పోలీసు ఉన్నతాధికారులు కోరుతున్నారు. ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనుక కూర్చున్న వారు హెల్మెట్‌ను విధిగా ధరించాల్సి ఉంటుంది. ఇతర వాహనాలు నడిపే వారితో పాటు కో ప్యాసింజర్ సైతం సీటు బెల్టును ధరించాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, రవాణాశాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారమిచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేయనున్నారు.

ఉల్లంఘన, కొత్త జరిమానా..

- లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇస్తే రూ.5000
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5000
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.1000
- ట్రిపుల్ డ్రైవింగ్ రూ.1000
- మైనరు వాహనం నడిపితే రూ.10,000
- అతి వేగం చిన్నవాహనాలకు రూ.1000
- పెద్దవాహనాలకు రూ.2000
- ప్రమాదకరంగా వాహనాన్ని నడిపితే రూ.2000 (మొదటిసారి), రూ.10,000(రెండోసారి)
- రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడిపితే రూ.5,000(మొదటిసారి), రూ.8,000 (రెండోసారి)
- వాహనాలతో రేసింగ్ చేస్తే రూ.5,000(మొదటిసారి), రూ.10,000(రెండోసారి)
- సీటు బెల్టు ధరించకపోతే రూ.1000
- హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1000
- సైలెన్సర్ తీసేసి నడిపితే రూ.1000(మొదటిసారి), రూ.2000(రెండోసారి)
- ఇన్సూరెన్స్ లేని వాహనాలకు రూ.2000(మొదటిసారి), రూ.4000 (రెండోసారి)
- మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10,000, జైలు శిక్ష (న్యాయమూర్తి ఆదేశాల మేరకు)

నిబంధనలు పాటించాలి



నూతన మోటారు వాహన చట్టాలను పాటించేందుకు వాహనదారులు పోలీసులకు సహకరించాలి. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారుడు నిబంధనలు పాటించడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. నిబంధనలు ఉల్లఘించిన వాహనాలకు వేసిన జరిమానాలను వెంటనే చెల్లించాలి.
– పులిశేఖర్, సీఐ, పత్తికొండ రూరల్

సంతాన వరదుడు..శ్రీరంగనాథుడు

- నేటి నుంచి బ్రహోత్సవాలు ప్రారంభం
- స్వామిని కొలిస్తే సంతానం కలుగుతుందని ప్రతీతి
- 6న కల్యాణోత్సవం, రథోత్సవం
- పులికొండ తరలిరానున్న భక్తజనం


రంగనాథస్వామి మూలమూర్తి

పత్తికొండ రూరల్ : మండలంలోని పులికొండ గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు సంతాన వరుదుడిగా ప్రసిద్ధి గాంచాడు. సంతానం కలగని దంపతులు స్వామి వారిని దర్శించి తమ కోరికను విన్నవిస్తే స్వామి వారి అనుగ్రహం సిద్ధిస్తుందని ప్రతీతి. ఇలా ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఎందరో భక్తులు స్వామి వారి కటాక్షాన్ని పొందారు. ఇలా భక్తుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. ప్రతి ఏడాది లాగే సోమవారం బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా రంగనాథ స్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

ఉత్సవాలు ఇలా..

సోమవారం ఆలయ అర్చకులు స్వామివారి ఆలయాన్ని శుద్ధి చేసి బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభించారు. మంగళవారం కలశ స్థాపన, పుణ్యాహావాచనం , సాయంత్రం అంకురార్పణ, 5న అభిషేకం, సహస్త నామార్చన, మహానైవేద్యం, సాయంత్రం పల్లకీసేవ, ఉపన్యాసములు ఉంటాయి. 6న ఉదయం 10.30గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రథపూజ, రథాంగ హోమం, బలిహరణ పూజలు, సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం ఉంటుంది. 7న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ ఈఓ వీరయ్య తెలిపారు.

నిరుపయోగంగా..


వినియోగానికి నోచుకోని ఎంపీడీఓ కార్యాలయం వద్దనున్న జనరేటర్


వాడకుండా వదిలేసిన నీటి పథకం జనరేటర్


మూలకు చేరిన ప్లాస్టిక్‌ను కాల్చే యంత్రం

మద్దికెర : ప్రజలకు సకాలంలో సేవలు అందించడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి జనరేటర్లు, వాహనాలు, యంత్రాలు అందజేస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారి ప్రజాధనం వృథా అవుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పదిహేనళ్ల క్రితం రూ.15 లక్షలు విలువజేసే జనరేటర్‌ను ప్రభుత్వం అందజేసింది. అలాగే..మద్దికెర గ్రామానికి విద్యుత్ అంతరాయం కలిగినా నిరంతరం నీటిని అందించడానికి దాతలు, వాటర్ షెడ్ పథకం కింద రూ.15 లక్షల విలువజేసే జనరేటర్‌ను కొంతకాలం పాటు వినియోగించి మూలన పడేశారు. పర్యావణానికి అడ్డంకిగా మారిన ప్లాస్టిక్‌ను కాల్చివేసేందుకు యంత్రం వచ్చి పదేళ్లు గడిచినా ఇంతవరకు వినియోగించలేదంటే అధికారుల నిర్లక్ష్యస్థాయిని అర్థం చేసుకోవచ్చు. వాటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

కల నెరవేరేనా?


చిప్పగిరి సమీపంలో వర్షాలకు కోతకు గురైన చిప్పగిరి, దౌల్తాపురం,నంచర్ల రోడ్డు

చిప్పగిరి: దశాబ్దాలుగా గుంతలు పడిన రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ హయాంలో నూతన రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం రావడంతో బిల్లులు నిలిచిపోయి పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో తమ చిరకాల కల నెరవేరేనా అని నంచర్ల,దౌల్తాపురం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని నంచర్ల,దౌల్తాపురం రెండు గ్రామాలు మండల కేంద్రం చిప్పగిరి కి రావాలంటే 10 కి.మీ దారి అందుబాటులో ఉన్నా దారి సరిగా లేకపోవడంతో అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి రావడానికి 40 కి.మీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.11 కోట్లతో నంచర్ల,దౌల్తాపురం మీదుగా మద్దికెర వరకు 14 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి 40 శాతం పనులు పూర్తి చేశారు. దీంతో తమ చిరకాల కల నెరవేరబోతుందని ఆయా గ్రామాల ప్రజలు సంబరపడ్డారు. అయితే ఇంతలోనే ఎన్నికలు రావడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం బిల్లులు మంజూరుకాక పనులు నిలిచిపోయాయి. వర్షాకాలంలో అధిక వర్షాల కారణంగా వేసిన రోడ్డు గుంతలు పడి, మరికొన్ని ప్రాంతాల్లో కోతకు గురై కొట్టుకు పోయింది. కంకర పనులు మాత్రమే చేయడంతో ఆ రోడ్డుపై కనీసం నడవలేని దుస్థితి. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.


దౌల్తాపురం వరకు కంకర పనులు చేసి వదిలి వేసిన రోడ్డు

నేడు జోడు రథోత్సవం



గురుశిష్యులు కాడ సిద్ధలింగేశ్వరస్వామి, గూళ్యం గాదిలింగేశ్వరస్వామి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలోని శ్రీ కాడ సిద్ధలింగేశ్వరస్వామి, గాదిలింగేశ్వరస్వామి వార్ల జోడు రథోత్సవానికి ఎంతో ప్రాముఖ్యతనుంది. గురుశిష్యులైన వీరు... చాలా సంవత్సరాలుగా గూళ్యం గ్రామంలో స్థిరపడి ఉన్నారని స్థానిక చరిత్ర. స్వామివార్ల జోడు రథోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా స్వాముల వారికి ఆకుపూజలు, పంచామృతాభిషక, జలాభిషేకం, గణపతిపూజ తదితర పూజలు చేపడతారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు, నందికోలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం గంధ దీపోత్సవం, కుంభాభిషకం, పల్లకీసేవ తదితర ప్రత్యేక పూజలు జరిపిస్తారు. తదనంతరం రథోత్సవం జరుగుతుంది. వేడుకను తిలకించేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. 15 రోజులుగా ఇక్కడ ఎద్దుల అమ్మకాలు జరుగుతాయి.